బంగ్లాదేశ్‌లో హసీనా ఘనవిజయం...

బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ పార్టీ నాయకురాలు షేక్ హసీనా... దేశ ప్రధానిగా రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూస్తానని ప్రకటించారు. శాంతి భద్రతలను మెరుగుపరచటం.. ద్రవ్యోల్బణాన్ని అదుపుచేయటం.. అవినీతిని, తీవ్రవాదాన్ని నిరోధించడం.. బంద్‌లు, వీధి ప్రదర్శనలతో ప్రజాస్వామ్యాన్ని, దేశ ప్రతిష్టను వీధిన పడేయకుండా సంయమనం పాటించడం.. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేయటం... రాజకీయ ప్రత్యర్థి, ప్రతిపక్ష నాయకురాలు బేగం ఖలీదా జియాతో వ్యక్తిగత విబేధాలకు స్వస్తి చెప్పటం.. భారత్‌తో సహా పొరుగు దేశాలన్నింటితో సంబంధాలను పటిష్టపరచటం–తన ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా హసీనా పేర్కొన్నారు. బంగ్లాదేశ్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ, దాని మిత్రపక్షాలు మొత్తం 300 సీట్లలో 262 స్థానాలు గెలుచుకొని మూడింట రెండొంతుల మెజారిటీని సాధించాయి. బేగం ఖలీదా జియా నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), దాని మిత్రపక్షాలైన జమాతే ఇస్లామీ కేవలం 32 స్థానాల్లోనే గెలిచాయి. ఎన్నికల్లో పోటీ ముఖ్యంగా అవామీ లీగ్, బీఎన్‌పీల మధ్య జరిగింది. సైద్ధాంతిక విషయాలు కాకుండా.. నిత్యావసర వస్తువుల ధరలు, అవినీతి, శాంతిభద్రతలు.. ఎన్నికల ముఖ్యాంశాలుగా నిలవడం విశేషం! మతఛాందసవాద పార్టీ జమాతే ఇస్లామీ ఎన్నికల్లో చావుదెబ్బ తినటం.. అది మద్దతిచ్చిన బీఎన్‌పీ కూడా పరాజయం పాలవటం.. భారత్ పట్ల సానుకూలంగా వ్యవహరించే షేక్ హసీనా ఘనవిజయం సాధించటం.. భారత్‌కు అనుకూల పరిణామం. బంగ్లాదేశ్‌లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావటంతో.. రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగవుతాయని భారత్ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఎన్నికల నేపథ్యం:

వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం.. బంగ్లా పార్లమెంటు ఎన్నికలు 2007, జనవరిలో జరగాల్సి ఉంది. నాడు అధికారంలో ఉన్న ఖలీదా జియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు ప్రారంభమయ్యాయి.. ప్రతిపక్షాల పిలుపుతో ఢాకా దిగ్బంధనం జరిగింది.. ఇలాంటి వరుస పరిణామాలతో సామాన్య జీవితం తీవ్రంగా ప్రభావితమైంది. ఖలీదా జియా పాలనలో దేశంలో అవినీతి పెచ్చరిల్లిందని.. ఛాందసవాదులు, తీవ్రవాదమూకలు విచ్చలవిడిగా బలోపేతమవుతున్నాయని.. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని.. కాబట్టి, ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ప్రతిపక్ష పార్టీల ర్యాలీలను తిప్పికొట్టడానికి, అధికారపక్షం కూడా తన మద్దతుదారులతో ప్రదర్శనలు నిర్వహించింది. దాంతో ఇరుపక్షాల కార్యకర్తల మధ్య వీధిపోరాటాలు

ప్రారంభ మయ్యాయి. ఫలితంగా రాజకీయ హింస చోటుచేసుకుంది. జనజీవనం అస్థవ్యస్థమైంది. దాంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు సైన్యం జోక్యం చేసుకుంది. 2007, జనవరిలో జరగాల్సిన ఎన్నికలను రద్దుచేసింది. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించి, నిపుణులతో ఒక మధ్యంతర ప్రభుత్వాన్ని సైన్యం ఏర్పాటు చేసింది. సైన్యం బలపరిచిన మధ్యంతర ప్రభుత్వం... దేశంలో అవినీతిని రూపుమాపేందుకు అనేక మంది రాజకీయ నాయకులను (షేక్ హసీనా, బేగం ఖలీదా జియాలతో సహా), వారి పిల్లలను, అవినీతితో బలపడిన వ్యాపారవేత్తలను విచారించింది. అత్యంత అవినీతిమయ దేశంగా బంగ్లాదేశ్ వార్తల్లోకి ఎక్కటం ఈ సందర్భంగా గమనార్హం. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కొంతమంది మాజీ మంత్రులకు ప్రత్యేక న్యాయస్థానం శిక్షలు కూడా విధించింది. మధ్యంతర ప్రభుత్వం ఎన్నికల సంస్కరణలను సైతం ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిలో దొర్లిన తప్పులను సవరించింది. షేక్ హసీనా, బేగం ఖలీదా జియాలపై విధించిన రాజకీయ నిషేధాన్ని కూడా నెమ్మదిగా ఎత్తివేసింది. దాంతో దేశంలో మళ్లీ ప్రజాస్వామ్య పునరుద్ధరణకు రంగం సిద్ధమైంది. 2008, ఆగస్టులో నిర్వహించిన స్థానిక ఎన్నికలతో ప్రజాస్వామ్య పునరుద్ధరణ ప్రక్రియ ప్రారంభమైంది. స్థానిక ఎన్నికల అనంతరం 2008, డిసెంబర్‌లో పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయని మధ్యంతర ప్రభుత్వం ప్రకటించింది.

గతం:

మౌర్యుల, గుప్తుల సామ్రాజ్యంలో భాగంగా ఉన్న బెంగాల్ కాలక్రమంలో 16వ శతాబ్దం నాటికి మొఘల్ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. 1757లో ప్లాసీ యుద్ధం కారణంగా బెంగాల్.. ఈస్టిండియా కంపెనీ అధీనంలోకి వచ్చింది. ఈస్టిండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు (భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం) అనంతరం మిగతా భారతదేశంతో పాటు బెంగాల్ కూడా ఆంగ్లేయుల ప్రత్యక్ష పాలనలోకి వచ్చింది. 1905లో పరిపాలనా సౌలభ్యం కోసం బెంగాల్‌ను.. తూర్పు బెంగాల్‌గా, పశ్చిమ బెంగాల్‌గా విభజిస్తున్నట్లు అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ కర్జన్ ప్రకటించాడు. బెంగాల్ విభజన ద్వారా.. హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టి, వారిని విభజించి పాలించటానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ.. భారత జాతీయ కాంగ్రెస్ నేతృత్వంలో.. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువమంది హిందువులు. కాగా, తూర్పు బెంగాల్‌లో అత్యధికులు ముస్లింలు (సూఫీ మతస్తుల రాకతో ఆరంభమైన ఇస్లాం మతవ్యాప్తి.. తర్వాతి కాలంలో ముస్లిం రాజుల దండయాత్రలతో తూర్పు బెంగాల్‌లో వేగంగా వ్యాప్తి చెందింది). బెంగాల్ విభజనను నిరసిస్తూ... విశ్వకవి రవీంద్ర నాథ్ ఠాగూర్ తన 'అమర్ సోనార్ బంగ్లా'అనే గీతంలో బెంగాల్ ఔన్నత్యాన్ని కొనియాడారు. 1911లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ విభజనను ఉపసంహరించుకుంది.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే సమయంలో దేశ విభజన అనివార్యమై.. ముస్లింల

జనాభా అధికంగా ఉన్న తూర్పు బెంగాల్ ప్రాంతాన్ని పాకిస్తాన్‌లో భాగంగా ఉంచటం జరిగింది. అప్పటి నుంచి తూర్పు బెంగాల్‌ను తూర్పు పాకిస్తాన్‌గా పిలవటం ప్రారంభమైంది. కీలక పదవుల్లో తూర్పు పాకిస్తాన్ ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉండటం.. పశ్చిమ పాకిస్తాన్ నుంచి వచ్చినవారే ప్రాముఖ్యత కలిగిన పదవుల్లో ఉండటంతో... తూర్పు పాకిస్తాన్‌లో అసంతృప్తి మొదలైంది. 1948లో పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను తూర్పు, పశ్చిమ పాకిస్తాన్‌లలో ఏకైక అధికార భాషగా ప్రకటించటంతో అది మరింత ఎక్కువైంది. తూర్పు పాకిస్తాన్ ప్రజలకు అన్ని రంగాల్లోనూ వివక్ష ఎదురవుతోందని.. ఈ అన్యాయాన్ని ప్రతిఘటించాలంటూ... 1949లో బెంగాలీ భాష మాట్లాడే ప్రజల రాజకీయ గొంతుగా షేక్ ముజిబుర్ రెహమాన్ నాయకత్వంలో అవామీ లీగ్ ఏర్పడింది. పెరుగుతున్న నిరసన జ్వాలలకు తలొగ్గిన పాకిస్తాన్ ప్రభుత్వం.. 1956లో తూర్పు పాకిస్తాన్‌లో బెంగాలీ భాషకు అధికార భాష హోదా కల్పించింది. అప్పటినుంచి పాకిస్తాన్‌లో ఒక దేశం రెండు భాషల విధానం అమల్లోకి వచ్చింది. భాషకు అధికార హోదా తెచ్చుకున్నా.. పరిపాలనలో తమ వాణి వినిపించలేక పోతున్నామనే అసంతృప్తి వారిలో చల్లారలేదు. పాకిస్తాన్ ప్రభుత్వం పంజాబ్ పఠాన్ జాతీయుల ప్రయోజనాలను కాపాడుతూ.. బెంగాల్ జాతీయుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందనే నమ్మకం తూర్పు పాకిస్తాన్‌లో అధికమైంది. తమ దేశంలోనే తమను రెండో తరగతి పౌరుల్లా పరిగణిస్తున్నారనే భావన వారిలో నానాటికీ బలపడుతూ వచ్చింది. 1960లలో అవామీ లీగ్ నేతృత్వంలో స్వయం ప్రతిపత్తి కోసం ఉద్యమం ప్రారంభమైంది. దీనంతటికీ అవామీ లీగ్ నాయకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ కారణమంటూ.. పాకిస్తాన్ ప్రభుత్వం 1966లో ఆయన్ను అరెస్టు చేసింది. ప్రజాందోళనకు తలొగ్గి, 1969లో విడుదల చేసింది. 1970లో పెను తుఫాను సంభవించిన సమయంలో ప్రభుత్వం తక్షణం స్పందించకపోవడంతో దాదాపు 500 మంది మరణించారు. దాంతో ప్రజల ఆవేశం కట్టలు తెంచుకుంది. 1970లో జరిగిన ఎన్నికల్లో షేక్ ముజిబుర్ రెహమాన్ నాయకత్వంలోని అవామీ లీగ్, తూర్పు పాకిస్తాన్‌లో ఘనవి జయం సాధించినా.. ఆ ఎన్నికల ఫలితాలను గుర్తించటానికి పాకిస్తాన్ ప్రభుత్వం నిరాకరించింది. ఆయన్ను 1971లో చర్చల కోసం పశ్చిమ పాకిస్తాన్‌కు పిలిపించి, అరెస్టు చేసింది. అంతేకాకుండా పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ యాహ్యాఖాన్, ఆపరేషన్ సెర్చ్ లైట్ పేరుతో తూర్పు పాకిస్తాన్‌పై సైనిక చర్యను ప్రారంభించారు. హింసాయుత ఈ సైనిక చర్యలో దాదాపు 3 లక్షల మంది మరణించారు. కోటి మందికి పైగా ప్రజలు ప్రాణ భీతితో శరణార్థులుగా భారత్‌కు పారిపోయి వచ్చారు. భారత్‌కు వచ్చి తలదాచుకున్న అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలు 'ముక్తివాహిని' పేరుతో ఒక దళాన్ని ఏర్పాటు చేశారు. పాకిస్తాన్ సైనిక అరాచకాల నుంచి తూర్పు పాకిస్తాన్ ప్రజలకు ముక్తిని ప్రసాదించడమే తన లక్ష్యంగా గెరిల్లా దాడులు మొదలుపెట్టిన ముక్తివాహినికి... క్రమేణా ఆ దేశ సైన్యంలో నుంచి కూడా మద్దతు లభించడం ప్రారంభమైంది. వలస వస్తున్న బంగ్లాదేశీయులు తన అంతర్గత భద్రతకు సవాల్‌గా మారటంతో... భారత సైన్యాలు కూడా ముక్తివాహినికి మద్దతుగా నిలిచాయి. దాంతో అజ్ఞాతంలో ఉన్న అవామీ లీగ్ నేతలు 1971, మార్చి 26న స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. పాకిస్తాన్ సైన్యం ఢాకాలోనూ, మరికొన్ని చోట్ల ఊచకోతకు

పాల్పడింది. భారత సైన్యం ప్రత్యక్షంగా యుద్ధంలో జోక్యం చేసుకోవటంతో... 1971, డిసెంబర్ 16న పాకిస్తాన్ సైన్యం లొంగిపోయింది. పాకిస్తాన్ ప్రభుత్వం 1972లో షేక్ ముజిబుర్ రెహమాన్‌ను విడుదల చేసింది. బంగ్లాదేశ్ పార్ల మెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకొని.. షేక్ ముజిబుర్ రెహమాన్ ప్రధానమంత్రిగా నూతన దేశంగా ఆవిర్భవించింది. రవీంద్రనాథ్‌ఠాగూర్ రాసిన Amar Sonar Bangla గీతాన్ని తన జాతీయగీతంగా ప్రకటించుకుంది. 1975లో షేక్ ముజిబుర్ రెహమాన్‌ను, ఆయన కుటుంబ సభ్యులను బంగ్లాదేశ్ సైన్యంలోని కొంతమంది అధికారులు ధారుణంగా హత్య చేశారు. దాంతో ఆయన కుమార్తె షేక్ హసీనా భారత్‌కు పారిపోయి వచ్చి, తలదాచుకోవాల్సి వచ్చింది. మూడు నెలల రాజకీయ అనిశ్చితి అనంతరం జనరల్ జియా ఉర్ రెహమాన్ అధికార బాధ్యతలు చేపట్టి.. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్ పీ)ని స్థాపించడంతో ఆ దేశంలో బహుళ పార్టీ రాజకీయ వ్యవస్థ ప్రారంభమైంది. 1981లో జనరల్ జియా ఉర్ రెహమాన్‌ను కూడా సైన్యంలోని కొన్ని విద్రోహ శక్తులు హత్యచేశాయి. దాంతో పాలనా పగ్గాలు జనరల్ ఎర్షాద్ చేతిలోకి వెళ్లాయి. ఆయన 1982 నుంచి 1990 వరకు బంగ్లాదేశ్‌ను పాలించారు. అయితే, దేశంలో అవామీ లీగ్, బీఎన్‌పీలు ప్రారంభించిన ప్రజాస్వామ్య పునర్నిర్మాణ పోరుకు తలొగ్గి అధికారం నుంచి తప్పుకొని, 1991లో ఎన్నికలు జరిపించారు. ఆ ఎన్నికల్లో జియా ఉర్ రెహమాన్ భార్య అయిన బీఎన్‌పీ నాయకురాలు బేగం ఖలీదా జియా బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1996లో జరిగిన తదుపరి పార్లమెంటు ఎన్నికల్లో షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ విజయం సాధించింది. దాంతో బంగ్లాదేశ్ వ్యవస్థపాకుడైన షేక్ ముజీబుర్ రెహమాన్ స్థాపించిన అవామీ లీగ్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. 2001లో జరిగిన పార్ల మెంటు ఎన్నికల్లో తిరిగి బీఎన్‌పీ నాయకురాలు ఖలీదా జియా విజయం సాధించి, పరిపాలనా పగ్గాలు చేపట్టారు. ఈమె పరిపాలనాకాలం ముగిసి, సాధారణ ఎన్నికలు జరగబోయే తరుణంలోనే దేశంలో అవినీతి, అనిశ్చితి, అభద్రత అధికమయ్యాయనే కారణంతో సైన్యం బలపరచిన మధ్యంతర ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టడంతో చరిత్ర పునరావృతమైనట్లయింది. ప్రజాస్వామ్య దేశంగా బంగ్లాదేశ్ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. అవామీ లీగ్, బీఎన్‌పీలు ప్రజాస్వామ్య రథానికి రెండు చక్రాలుగా కనిపిస్తాయి. 1991లో జనరల్ ఎర్షాద్ సైనిపాలన ముగిసిన నాటి నుంచి దేశంలో అనధికారికంగా రెండు పార్టీల వ్యవస్థ వేళ్లూనుకుంది. దేశ మొదటి అధ్య క్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తె షేక్ హసీనా అధ్యక్షతన ఉన్న అవామీ లీగ్.. మరో మాజీ మిలిటరీ పాలకుడు జియా ఉర్ రెహమాన్ భార్య బేగం ఖలీదా జియా నేతృత్వంలోని బీఎన్‌పీలు ప్రధాన పార్టీలుగా ఉంటూవచ్చాయి. ముస్లిం అతివాద పార్టీ అయిన 'జమాతే ఇస్లాం', ఎర్షాద్ స్థాపించిన జాతీయ పార్టీలాంటి ఇతర చిన్న పార్టీలు... అవసరం, అవకాశం ఆధారంగా రెండు ప్రధాన పార్టీలలో ఏదో ఒకదాని పంచన చేరటం ఆనవాయితీగా మారింది. ప్రజాస్వామ్యం వేళ్లూనుకుంటుందని అనిపించినప్పుడల్లా.. విద్రోహ చర్య జరిగి, సైనిక పాలన రావటం.. మళ్లీ కొంతకాలం తర్వాత ప్రజాస్వామ్యం తిరిగి ప్రారంభమవటం జరుగుతూ వస్తోంది. 1991 తర్వాత 15 ఏళ్లు పాలించిన అవామీ లీగ్, బీఎన్‌పీలు.. దేశంలో ప్రజా స్వామ్య మనుగడకు అవసరమైన పాలనా

వ్యవస్థలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను ఏర్పరచలేకపోవటం ఆ పార్టీల వైఫల్యంగానే భావించాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోలేక, అవినీతి ఆరోపణల్లో కూరుకుపోవటం.. అధికారం కోల్పోయినప్పుడల్లా పాలక పక్షాన్ని గద్దెదించటానికి తరచూ వీధుల్లో నిరసన ప్రదర్శనలతో ప్రజా జీవితాన్ని అతలాకుతలం చేయటం.. వంటి చర్యలతో రెండు పార్టీలు ప్రజల సాను భూతిని కోల్పోయాయనే చెప్పాలి. ఈ పరిణామాల నుంచి అవామీ లీగ్, బీఎన్‌పీల నేతలు పాఠాలు నేర్వకుంటే.. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవటమే కాకుండా... బంగ్లాదేశ్‌ను శాశ్వతంగా సైనిక పాలనలోకి నెట్టివేసే అవకాశాన్నిచ్చి, చారిత్రాత్మక తప్పిదాన్ని చేసిన వారవుతారు!!

చరిత్రలో బంగ్లాదేశ్

- ఒకప్పటి తూర్పు బెంగాలే నేటి పాకిస్తాన్.
- 1905లో బెంగాల్ విభజన (తూర్పు, పశ్చిమ). దీనికి వ్యతిరేకంగా ఠాగూర్ 'అమర్ సోనార్ బంగ్లా' రచన, 1911లో విభజన రద్దు
- 1947లో తూర్పు బెంగాల్ (తూర్పు పాకిస్తాన్)తో కలసి పాకిస్తాన్ ఏర్పాటు
- తూర్పు పాక్‌లోని బెంగాలీయులకు అన్యాయం జరుగుతోందంటూ షేక్ ముజిబుర్ రెహమాన్ సారథ్యంలో అవామీ లీగ్ ఏర్పాటు
- 1956 తూర్పు పాకిస్తాన్‌లో బెంగాలీ భాషకు అధికార హోదా
- 1971 ఆపరేషన్ సెర్చ్‌లైట్ పేరుతో తూర్పు పాకిస్తాన్‌పై పాక్ సైనిక చర్య
- 1972లో తూర్పు పాకిస్తాన్.. బంగ్లాదేశ్‌గా ఆవిర్భావం. ప్రథమ ప్రధానిగా ముజిబుర్ రెహమాన్
- 1975లో ముజిబుర్ రెహమాన్ హత్య, జియాఉర్ రెహమాన్ బాధ్యతల స్వీకరణ. బీఎన్‌పీ ఏర్పాటు
- 1981లో జియాఉర్ హత్య. ఎర్షాద్ చేతికి అధికారపగ్గాలు
- 1991లో ప్రజాస్వామ్యయుత ఎన్నికలు. ప్రధానిగా బేగంఖలీదా జియా. 1996లో అవామీలీగ్ విజయం. ప్రధానిగా హసీనా. 2001లో తిరిగి ఖలీదాకు పట్టం.